క్లుప్తంగా

వెంకన్న ఆదాయం రూ.5.90 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5,90,325లు వచ్చినట్లు ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈ ఆదాయం సెప్టెంబర్ 20 నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవదాయశాఖ తరఫున ఈవో మాధవి, అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, శ్రీవేంకటేశ్వర సేవాదళ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న అరబిందో ప్రతినిధులు

రణస్థలం: మండలంలోని ఎన్‌జీఆర్‌పురం, పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు మత్స్యకారులు ఇటీవల ఇతర ప్రాంతాలకు వేటకు వెళ్లి మృతి చెందారు. ఆయా కుటుంబాలకు రూ.మూడు లక్షలు అరబిందో ఫౌండేషన్ ఫార్మా లిమిటెడ్ తరఫున ఆర్థిక సహాయం చేశారు. పైడిభీమవరంలోని అరబిందో ఫార్మా కార్యాలయంలో ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్షన్నర చొప్పున చెక్కులు అందజేశారు. అరబిందో అనుబంధ సంస్థలైన శ్రేయాస్ పరిశ్రమ జీఎం పి.గోపాలకృష్ణారెడ్డి, ఏపీటోరియా పరిశ్రమ జీఎం కె.కమలాకర్ రెడ్డి, ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం



బడ్జెట్‌ను వివరిస్తున్న ఎంపీపీ సత్యవతి

జి.సిగడాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రవేశపెట్టిన మండల బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన బుధవారం మండల బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కె.నిర్మల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2023–24 సవరణ బడ్జెట్ రూ.49,05,56,000, వ్యయం రూ.49,05,56,47,000, మిగులు బడ్జెట్ రూ.9,000 ఉందని వివరించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



పెంట గ్రామంలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యవతి

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామ సచివాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి, సర్పంచ్ పున్నాన సోనియా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా మెరుగైన వైద్యం చేసుకోవచ్చన్నారు. వైద్యులు బి.యశ్వంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటు కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ నిర్దేశిత పని దినాలను కల్పించాలని, కనీస వేతనం గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల మండంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం శ్రామిక స్వయం శక్తి సంఘాల మేట్ల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఓ శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలివి రామకృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్

రణస్థలం: మండలంలోని 34 పంచాయతీల్లో బుధవారం నుంచి ఉపాధి హామీ సోషల్ ఆడిట్ జరుగుతుందని ఏపీఓ ఆర్.శ్రీనివాస నాయుడు తెలిపారు. సామజిక తనిఖీల్లో భాగంగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు అన్నీ గ్రామాల్లో పర్యటించి నివేదిక సమర్పిస్తారన్నారు. 2023–24 సంబంధించి వేతనాలు రూ.23.5 కోట్లు, పంచాయతీరాజ్ రూ.2.77 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ రూ.15లక్షలు, సీఎస్‌పీ రూ.27లక్షల ఖర్చుల వివరాలపై సామాజిక తనిఖీలు జరుగుతాయన్నారు. మండల ప్రజావేదిక సమావేశం జనవరి 25వ తేదీన నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ఎచ్చెర్ల: లావేరు మండలం బెజ్జిపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: గ్రామీణ యువతకు క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పైడిభీమవరం హైస్కూల్లో క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. క్రీడా పోటీల ద్వారా గ్రామీణ ఆణిముత్యాలను వెలికితీస్తామన్నారు. ఎంత మంచి పనులు చేసిన ప్రతిపక్షాలు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని, అటువంటి విమర్శలు ఎవరూ పట్టించుకోరన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి గురాన మానస, పైడిభీమవరం పంచాయతీ ఎంపీటీసీలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, నాయకులు లంకలపల్లి రమేష్, నారాయణప్పారావు, అల్లంపల్లి నాగరాజు, పంచాయతీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల: ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి తెలిపారు. అల్లినగరం ఉన్నత పాఠశాలలో క్రీడలను బుధవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్‌బాబా, గొలివి రామకృష్ణ, తూగిటి రమణబాబు, నర్సింగరావు పాల్గొన్నారు.

బెజ్జిపురంలో..

ఎచ్చెర్ల, లావేరు: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం బాలకృష్ణ, మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొంతు సూర్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు, దాశెట్టి తిరుపతిరావు, ఎంపీడీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం మండలంలో..

జి.సిగడాం: మండలంలో సంతవురిటి, ఆనందపురం, జాడ, జగన్నాథవలస, గెడ్డకంచరాం గ్రామాల్లో ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలను బుధవారం నిర్వహించారు. సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, చిత్తిరి మోహన్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, ఎంఈఓ ముళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: కబడ్డీ ఆడుతున్న ఎంపీపీ చిరంజీవి



జి.సిగడాం: సంతవురిటిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

భూ పట్టాల పంపిణీ



పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఇరవై ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయడంతో వారి కళ్లల్లో ఆనందం కన్పిస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జే.ఆర్.పురం పంచాయతీలో సీతంపేటకు చెందిన రైతులకు బుధవారం భూ పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పేదలు సాగుచేసుకునే భూములపై సర్వ హక్కులు కల్పించి రైతులుగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రణస్థలం వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జే.ఆర్.పురం పంచాయతీ సర్పంచ్ బవిరి రమణ, కొండములగాం, జే.ఆర్.పురం గ్రామ నాయకులు గొర్లె అప్పలనాయుడు, పిన్నింటి సత్యంనాయుడు, రాయపురెడ్డి శ్రీను, కోల అప్పన్న, అప్పడుదొర, ముద్దాడ రాజశేఖర్, తిప్పాన సతీష్, చౌదరి రాము, దుంప చిన్నారెడ్డి, లంకలపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ ప్రతినిధికి అభినందన



సత్యనారాయణను అభినందిస్తున్న వాకర్స్ సంఘాల సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, సూర్యా వాకర్స్ క్లబ్ ప్రతినిధి గుడ్ల సత్యనారాయణను బుధవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించారు. 30 ఏళ్లుగా జిల్లాలో సమాజ సేవ చేస్తున్న సత్యనారాయణ నడక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన వారిలో అగ్రగణ్యులు అని పలువురు కొనియాడారు. ఇటీవల విశాఖలో జరిగిన అంతర్జాతీయ నడక సంఘాల సదస్సులో ఉత్తమ కోఆర్డినేటర్‌గా గుర్తిస్తూ గౌరవ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా వాకర్స్ సంఘాల నేతలు గేదెల ఇందిరాప్రసాద్, కూన వెంకటరమణమూర్తి, పొట్నూరు గోవింద గుప్తా, శాసనపు జోగినాయుడు, సురేష్ పండా, అన్నెపు సత్యన్నారాయణలు అభినందించారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలి సంతోష్, బత్తుల దేవీ ప్రసాద్, ఆగురు ఆనందరావు, ఎం.మల్లిబాబు, జేసీ పట్నాయక్, గుడ్ల జగ్గారావు ఉన్నారు.

యువ టూరిజం క్లబ్ ఏర్పాటు



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వరా డిగ్రీ, జూనియర్ కళాశాలలో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో బుధవారం యువ టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా పట్యాటక శాఖ అధికారి నడిమింటి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ కమిషనర్ మార్గదర్శకాలను అనుగుణంగా పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విజ్ఞానం, వినోదం, విషయ పరిజ్ఞాన సమపార్జనే లక్ష్యంగా ఈ క్లబ్‌లు పనిచేస్తాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు పెంపకం, మట్టి పాత్రలు వాడటం, నీరు, విద్యుత్ పొదుపు వంటి వాటిపై ప్రజల్లో అవగాహన టూరిజం క్లబ్ యువత కల్పించాలని చెప్పారు. కళాశాల ఆవరణలు పార్కులా తీర్చిదిద్దాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ చిట్టిబాబు, జిల్లా టూరిజం అసిస్టెంట్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

కుప్పిలిలో భూసర్వే



కుప్పిలో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో భూముల రీసర్వేను బుధవారం ప్రారంభించారు. డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. సర్వే అనంతరం భూ హద్దులు నిర్ణయించి రాళ్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, సర్పంచ్ బల్లాడ హిందుమతి పాల్గొన్నారు.

రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్నత డీఈఓ, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఫలాలను విద్యార్థులకు చేరవేయడంలో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్ఎల్‌టీఏ) శ్రీకాకుళం జిల్లా శాఖ టేబుల్ క్యాలెండర్‌ను డీఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాషోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను, దీర్ఘకాలంగా ఉన్న డిమాండ్లను సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు పిసిని వసంతరావు, ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు డీఈవోకు వివరించారు. కార్యక్రమంలో సంఘ సహాధ్యక్షులు కుప్పన్నగారి శ్రీనివాసరావు, రఘుపాత్రుని శ్రీనివాసరావు, చింతపల్లి జనార్దనరావు, జి.మేరీ ప్రసాద్, గంటి మీనాకుమారి, బెండి కళ్యాణి, షాజాది భాను, తోట పద్మజ, పిడపర్తి వెంకట సాయిప్రసాద్, అరసవిల్లి గణపతిరావు, లోలుగు వెంకటరమణ, మజ్జి వెంకటరమణ, చాడ శ్రీనివాసరావు, రుప్ప తులసీదాసు, లోలుగు సత్యం, ఉప్పు త్రినాధరావు, షేక్ జాఫర్, రాడ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం



రామ్‌మనోహర్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్తానన్నారు. పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం రామ్‌మనోహర్‌నాయుడుకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మహిళా నాయకులు వినతిపత్రం అందజేశారు. మంత్రి ధర్మాన ప్రస్తుతం క్యాంపులో ఉన్నందున.. ఆయన వచ్చిన తరువాత సమస్యను అతని దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని, అందరూ విధుల్లోకి వెళ్లాలని రామ్‌మనోహర్‌నాయుడుకోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం



బాలుర తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్ : తల్లిదండ్రులు పిల్లల పట్ల నిర్లక్ష్య వైఖరితో ఉండకూడదని.. వారు ఏం చేస్తున్నారన్నది గమనిస్తుండాలని, లేదంటే సమాజంలో జరిగే కొన్ని సంఘటనలకు తమకు తెలియకుండానే బాధ్యులవుతారని శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు అన్నారు. ఈ నెల 25న ఉమెన్స్ కళాశాల మార్గంలో వృద్ధున్ని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి అతని మరణానికి కారణమైన ముగ్గురు బాలురును, వారి తల్లిదండ్రులను బుధవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, ఇచ్చినవారు నేరస్థులవుతారని చెప్పారు. ప్రమాదం జరిగిన స్థలం వద్ద ఇప్పటికే బారికేడ్లు పెట్టామన్నారు.

ఉమాజఠలేశ్వరునికి ఆరుద్ర నక్షత్రపూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

పరామర్శ..



వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు బూరాడ వెంకటరమణ తల్లి అమ్మడమ్మ (75) బుధవారం మృతి చెందారు. ఆ కుటుంబాన్ని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, వ్యసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పైడి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎర్నేన ప్రకాశరావు, అబోతుల జగన్నాథం, సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, సనపల త్రినాథరావు, పొందూరు, జి.సిగడాం, లావేరు, రణస్థలం, శ్రీకాకుళం మండలాలకు చెందిన పలువురు నాయకులు పరామర్శించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రాష్ట్రమహాసభలకు హాజరైన ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తోందని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ అన్నారు. కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్రమహాసభల్లో వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు రాజు, దుర్గాప్రసాద్, రేవతి,మానస, సంతోష్, తిరుపతి, యోహాన్, నితిన్, భూపతి హాజరయ్యారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ



కుర్చీలు అందజేసిన దృశ్యం

గార:

శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శ్రీకూర్మం– మత్స్యలేశం గ్రామానికి చెందిన ఉప్పాడ జనార్దనరావు తన కుమార్తె ప్రత్యూష పుట్టిన రోజు సందర్భంగా పది కుర్చీలను సమకూర్చారు. వీటిని బుధవారం ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారికి అందజేశారు.

దోమ తెరలు, దుప్పట్లు పంపిణీ



కొత్తగూడలో గిరిజలకు దుప్పట్లు, దోమ తెరులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని ఉల్లిమానుగూడ, కొత్తగూడ, చీపురుపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులకు రెడ్ క్రాస్ ఆఫ్ సింగపూర్ సౌజన్యంతో రెడ్ క్రాస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర, జిల్లా శాఖల ఆధ్వర్యంలో బుధవారం దోమ తెరలు, దుప్పట్లు, హైజీన్ కిట్లును జిల్లా శాఖ సభ్యుడు చిన్మయరావు పంపిణీ చేశారు. కరోనాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. జిల్లా శాఖ చైర్మన్ జగన్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు చిన్మయరావు తెలిపారు. మండల శాఖ సభ్యులు పొగిరి రవిసుజాత, సత్యనారాయణ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం–2024 డైరీ, క్యాలండర్‌ను ప్రముఖ డాక్టర్, రాగోలులోని జెమ్స్ కళాశాల అనాటమీ ప్రొఫెసర్ రేఖల మల్లేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పున్న రంగస్వామి, ప్రొఫెసర్ యేసో శ్రీనివాసులు, తీడ ప్రసాదరావు, గిడుతురి నీలాద్రిరావు, నూలు వెంకటరావు, గిడుతూరి చలపతిరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేట గ్రామంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లల జీవితం నాశనం అవుతుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతీ ఇంటిలోనూ ఆడ, మగ పిల్లలను సమానంగా పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఇంటిలో క్రమశిక్షణ నేర్పితే పాఠశాలల్లో సత్‌ప్రవర్తనతో ఉంటారని సూచించారు. ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ ర్యాలీలో మండల మహిళా సమాఖ్య వీఓఏ రాజు, మహిళలు పాల్గొన్నారు.

నేడు, రేపు కార్యవర్గ సమావేశాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రామలక్ష్మణ కూడలిలోని క్రాంతి భవన్ (సీపీఐ కార్యాలయం)లో ఎన్.ఎఫ్.టి.ఇ. బి.ఎస్.ఎన్.ఎల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యవర్గ సమావేశాలు గురు,శుక్రవారాల్లో జరగనున్నాయి. ఈ మేరకు సంబంధిత కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదల చేశారు.